సాక్షి తిరుపతి

7

బుధవారం। 5। ఫిబ్రవరి। 2025



తిరుమలలో రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహనానికి పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న మలయప్ప

అశేష భక్తజనం నడుమ చక్రస్నానంలో సేద తీరుతూ..





సప్తశోభితం

అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు

- శ్రీవారి పాదాలను తాకిన ఉషాకిరణాలు
- సప్త వాహనాలపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- రాత్రి వరకు తగ్గని రద్దీ



చిన్నశేష వాహనంపై విహరిస్తున్న స్వామివారు

తిరుమల: తిరుమలలో రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల కోలాహలం మధ్య శ్రీమలయప్పస్వామి వారు సూర్యోదయం నుంచి రాత్రి వరకు సప్త వాహనాల్లో విహరించారు. ఉత్సవం నేపథ్యంలో ఉషోదయాన ప్రాతఃకాల ఆరాధన పూర్తి కాగానే ఆలయం నుంచి వాహన మండపానికి శ్రీమలయప్పస్వామి వేంచేశారు. ఇక్కడ వజ్రకవచధారి అలంకారభూషితులై సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ తిరువీధుల్లో వాయువ్య దిశకు చేరుకున్నారు. ఉదయం ఉదయభాను కిరణాలు స్వామివారి పాదాలను తాకాయి. శ్రీవారి పాదాలపై ఉషాకిరణాలు ప్రసరించి సూర్య భగవానుడు అంజలి ఘటించారు. ఈ సమయంలో భక్తకోటి అఖండ గోవిందనామ కీర్తనలతో వేంకటాచలం ప్రతిధ్వనించింది. సూర్యప్రభ వాహనాన్ని వీడి చిన్నశేష వాహనాన్ని స్వామి అధిష్టించి చతుర్మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం గరుడ, హనుమంత వాహనాలపై ఊరేగి వాహన మండపానికి వేంచేశారు. మధ్యాహ్నం శ్రీమలయప్పస్వామి ఆలయానికి చేరుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు వాహనసేవల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

స్వల్పంగా తోపులాటలు

వాహనసేవ గంటల వ్యవధిలోపే ముగించాల్సి ఉండడంతో వేగం కారణంగా స్వల్పంగా తోపులాటలు చోటు చేసుకున్నాయి. అయితే వాహన సేవల ముందు భక్తుల పట్ల భద్రతా సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తూ తొసివేయడంపై కొందరు అసహనం వ్యక్తం చేశారు. భారీగా అధికారులు, బోర్డు సభ్యులు కుటుంబ సభ్యులు వాహనముందు చేరడంతో వారిని పక్కకు పంపడం భద్రతా సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. రాంభగీచావద్ద భక్తులను అనుమతించకపోవడంతో పోలీసులతో స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది.

నిరంతరాయంగా అన్నప్రసాదాల వితరణ

గ్యాలరీల్లోని భక్తులకు పాలు, మజ్జిగ, అన్నప్రసాదాలను టీటీడీ నిరంతరాయంగా అందించింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంతో పాటు తిరువీధుల్లోని గ్యాలరీల్లోని భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, కాఫీ, మజ్జిగ అందించారు. టీటీడీ ఈవో శ్యామలారావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మణికంఠ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం

శ్రీసుదర్శన చక్రత్తాళ్వారులు ఊరేగుతూ శ్రీవరాహస్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. సుదర్శన భగవానునికి శ్రీవారి పుష్కరిణిలో పవిత్ర స్నానం నిర్వహించారు. అనంతరం శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై ఊరేగారు. రాత్రి చంద్రోదయం సమయాన చంద్రప్రభ వాహనంపై శ్రీమలయప్పస్వామి ఒక్కరే ఊరేగి తిరిగి వాహన మండపానికి చేరుకున్నారు.



గరుడ వాహన సేవ



హనుమంత వాహన సేవ



కల్పవృక్ష వాహన సేవ



సర్వభూపాల వాహన సేవ



చంద్రప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్, ఈఓ, అదనపు ఈఓ

న్యూస్‌రీల్

బాలికోన్నత పాఠశాలకు హరిత అవార్డు



గ్రీన్ స్కూల్ అవార్డు అందుకుంటున్న శ్యామలత

నారాయణవనం: స్థానిక బాలికోన్నత పాఠశాలకు ఈ ఏడాది హరిత పాఠశాలగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినట్లు హెచ్ఎం శశికళ తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ 2024–2025 విద్యాసంవత్సరానికి హరిత పాఠశాలగా జాతీయ స్థాయిలో ఎంపికైందని తెలిపారు. ఇందులో వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంతలతో వర్షపు నీటి నిల్వ, వాడిన నీటిని మొక్కలకు పంపడం, విద్యుత్ ఆదా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టు ఆమె వెల్లడించారు. నేషనల్ గ్రీన్ కోర్, సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డ్‌ను సంస్థ డైరెక్టర్ జనరల్ సునీత నరేన్ చేతుల మీదుగా పాఠశాల తరఫున జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్యామలత అందుకున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు డీఈఓ కుమార్, డిప్యూటీ డీఈఓ ప్రభాకర్ రాజులు ఫోన్‌లో అభినందించినట్టు వెల్లడించారు.

వామ్మో.. చిరుత!



వర్సిటీలో చిరుత జాడపై చర్చిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కేంద్రీయ లైబ్రరీ వెనుక చిరుత కనిపించినట్టు విద్యార్థులు మంగళవారం సాయంత్రం అటవీశాఖ అధికారులకు, వర్సిటీ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి అధికారులు కేంద్రీయ గ్రంథాలయం వద్దకు చేరుకొని వాహనాలతోనే ఆ పొదల్లో పరిశీలించారు. చిరుత జాడ కనిపించ లేదు. అక్కడ గుమికూడిన విద్యార్థులను రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఫారెస్ట్ అధికారి సౌజన్య కలిసి, చిరుత వ్యవహార శైలి, ఆహార సేకరణపై అవగాహన కల్పించారు. హాస్టల్‌కు వెళ్లే సమయంలో విద్యార్థులు గుంపులుగా వెళ్లాలని ఆదేశించారు. ఇప్పటికే వర్సిటీలో చిరుత కోసం ట్రాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. అయితే వాటి వద్దకు విద్యార్థులు వెళ్లడం వల్ల మనిషి పాదముద్రల వాసన గ్రహించి ఆ ట్రాప్ వద్దకు చిరుత రాదని తెలిపారు. డీఎస్ఎ సీ.రాయుడు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కలబడినా.. నిలబడ్డారు!

వారం రోజులుగా ఆధ్యాత్మిక తిరుపతి నగరం అట్టుడికి పోయింది. తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కాలకేయకూటమి చెలరేగిపోయింది. 48 మంది కార్పొరేటర్ల బలం కలిగిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడికి తెగబడింది. వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ అరాచకం సృష్టించింది. కుటుంబ సభ్యులను బెదిరిస్తూ భయాందోళనకు గురిచేసింది. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ అధికారులను అడ్డం పెట్టుకుని మరీ చిత్ర హింసలకు శ్రీకారం చుట్టింది. సోమవారం ఓటేయదానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై గూండాగిరి ప్రదర్శించింది. నలుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి కలకలం సృష్టించింది. ఆపై మంగళవారం ఓటింగ్‌లో పాల్గొన్న ఆ కార్పొరేటర్లు కన్నీళ్లు పెట్టుకోవడం వారి అరాచకాలకు నిదర్శనంగా నిలిచింది. మహిళా మేయర్, కార్పొరేటర్ల వీరోచిత పోరాటం రాష్ట్ర ప్రజానీకానికి ఆదర్శంగా నిలిచింది.

- కళ్లెదుటే అరాచకం సృష్టిస్తున్నా అదరలేదు, బెదరలేదు
- వీర సైనికులనిపించుకున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- కూటమి గూండాలను ఎదిరించిన మహిళా కార్పొరేటర్లు
- దొడ్డిదారిలో డెప్యూటీని లాక్కున్నా నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే
- వారం రోజులపాటు కూటమి గూండాలు వెంటాడినా చివరకు ఓటేశారు!

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కాలకేయ కూటమికి ఎదురొడ్డి పోరాడారు. నగరంలో వారం రోజులుగా కూటమి గూండాల అలజడులు.. అల్లర్లతో భయానక వాతావరణాన్ని సృష్టించారు. కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసినా.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అదరలేదు.. బెదరలేదు. తాము ప్రయాణిస్తున్న వాహనాన్ని సుమారు 500 మంది గూండాలు అడ్డుకుని రాడ్లు, రాళ్లతో దాడులకు తెగబడుతున్నా చింతించలేదు. ముఖ్యంగా మహిళా కార్పొరేటర్లు ఎదిరించి వీరోచిత మహిళలనిపించుకున్నారు. పోలీసులు, రెవెన్యూ, కార్పొరేషన్, కిరాయి రౌడీలందరినీ ఉపయోగించినా కుట్రలు పారలేదు.



భూమన కరుణాకరరెడ్డితో ఎంపీ, మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కూటమి అరాచకాలకు ఆ కన్నీళ్లే సాక్ష్యం

తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికలు ముగిశాక కిడ్నాప్‌నకు గురైన వైఎస్సార్‌సీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ తిరిగి భూమన కరుణాకరరెడ్డి నివాసానికి విచ్చేశారు. జరిగిన తీరును వివరించారు. తమపై భౌతిక దాడులు చేస్తూ, ఆస్తులు విధ్వంసానికి పాల్పడిన నరకం చూపించారని అనీష్‌రాయల్ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం భూమన కరుణాకరరెడ్డి కాళ్లపై పడి క్షమించమని వేడుకున్నారు. అనీష్ ఆవేదనను అర్థం చేసుకున్న భూమన కన్నీరు పెట్టుకోవడం చూసి కార్పొరేటర్లంతా భావోద్వేగానికి లోనయ్యారు. భవిష్యత్‌లో అంతా కలసికట్టుగా పనిచేయడానికి వేదికగా మారిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడ్డారు.

నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే

కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా దిగజారుడు రాజకీయాలకు ఒడిగట్టారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కొందరిని అధికారబలంతో బెదిరించి, భయపెట్టి ప్రలోభాలకు గురిచేశారు. దొడ్డిదారిలో డెప్యూటీ మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. కానీ నైతిక విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆదరిస్తూ..అండగా నిలుస్తూ!



ఎంపీ గురుమూర్తి, అభినయ్ ఆత్మీయ ఆలింగనం

వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి కార్పొరేటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలబడడాన్ని పలువురు ప్రసంసిస్తున్నారు. వారం రోజుల పాటు వారిని సురక్షితంగా తన నివాసానికి తీసుకొచ్చారు. ఆపై వారి కుటుంబాలకు అండగా నిలిచారు. దాడులు, ప్రతి దాడులను ఎప్పటికప్పుడు ప్రతిఘటించారు. అదేవిధంగా మేయర్ డాక్టర్ శిరీష మహిళే అయినా.. గూండాలు ఎదురొచ్చి దాడులు చేస్తున్నా అధైర్యపడలేదు. మహిళా కార్పొరేటర్లకు ధైర్యం చెబుతూ వీరోచితంగా పోరాడారు. మరో కార్పొరేటర్ ఆరణి సంధ్య మహిళా కార్పొరేటర్లను సమన్వయం చేసుకుంటూ కూటమి నేతల బెదిరింపు కాల్స్‌ను తిప్పికొట్టారు. ఇలా ప్రతి మహిళా కార్పొరేటర్ తమదైన శైలిలో పోరాడి అభినందనలు అందుకున్నారు.

పోరాట యోధులు మహిళా కార్పొరేటర్లు

- భూమన ప్రశంస



డెప్యూటీ మేయర్ ఎన్నికకు వెళుతున్న మేయర్ శిరీష, ఎంపీ గురుమూర్తితో మహిళా కార్పొరేటర్లు

తిరుపతి మంగళం: తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి నేతల అరాచకాలను, బెదిరింపులను, విధ్వంశాలను ఎదుర్కొంటూ వీరోచిత పోరాటం చేసిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు దేశానికే ఆదర్శంగా నిలిచారని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిలు ప్రశంసిచ్చారు. డెప్యూటీ మేయర్ ఎన్నికలో ఎలాగైనా గెలుచుకోవాలన్న దురాలోచనతో గత వారం రోజులుగా తిరుపతిలో కూటమి నేతలు చేస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అందులో కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బెదిరించి, భయపెట్టి లోబరుచుకున్నా అధిక శాతం వైఎస్సార్‌సీపీలోని మహిళా కార్పొరేటర్లు నీతి, నిజాయితీగా వైఎస్సార్‌సీపీ వైపే నిలబడ్డారని ప్రశంసించారు. వణుకు బెణుకు లేకుండా కూటమి కుట్రలను వీరోచితంగా ఎదుర్కొని వీర మహిళలుగా నిలిచారని తెలిపారు.

బలమనుకోవద్దు!



తిరుపతి నగర మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే. టీడీపీకి చెందిన ఒకే ఒక కార్పొరేటర్‌తో డెప్యూటీ మేయర్ స్థానాన్ని ఎలా దక్కించుకోగలుగుతారు..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికార బలం, దాడులు, ఆస్తుల ధ్వంసం, అక్రమ కేసులు, కిడ్నాప్‌లతో లోబరుచుకున్నారు. టీడీపీ గెలుపు చూసి తాము బలంతో గెలిచాం అనుకుంటున్నారు. ప్రజాకోర్టులో కూటమి ప్రభుత్వం ఓడిపోయింది. – డాక్టర్ ఎం.గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

ప్రజాస్వామ్యం ఖూనీ



తిరుపతి నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఓటమి ప్రజాస్వామ్య ఓటమి. ఎన్నికల్ల తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా శిరీషా విధుల నిర్వహణలో అవమానించారు. కార్పొరేషన్ సమావేశం లోపల జరుగుతుంటే బయట మేయర్ ఆందోళన చేసే పరిస్థితి ఏర్పడింది. ఒక్క ఓటు ఉన్న కార్పొరేటర్ గెలవడమేంటి. మేము ఓడిపోలేదు. వ్యవస్థల ఉదాసీన వైఖరి, అధికార దుర్వినియోగం గెలిచింది. – ఆర్కే రోజా, మాజీ మంత్రి

దుర్మార్గపు పాలన



ఏడాది కాలం డెప్యూటీ మేర్ పదవి కోసం కూటమి నేతలు కాలకేయుల్లా వ్యవహరిస్తున్నారు. మహిళా కార్పొరేటర్ల పట్ల టీడీపీ, జనసేన నేతలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరం. దౌర్జన్యాలతో డిప్యూటీ మేయర్‌ను అక్రమంగా గెలుచుకున్నారు. ఇది వారి గెలుపుగా భావిస్తే అంతకంటే దిగజారుడుతనం మొరకటి ఉండదు. కార్పొరేటర్లపై దాడులు చేయడం సిగ్గుచేటు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడిన కార్పొరేటర్లకు అభినందనలు. – డాక్టర్ ఆర్.శిరీష, తిరుపతి నగర మేయర్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 59,784 మంది స్వామివారిని దర్శించుకోగా 20,740 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.61 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎన్ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా వెంకటనారాయణ



నూతన వీసీని అభినందిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా కడియం వెంకట నారాయణను నియమిస్తూ వీసీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన డీఆర్‌డీఓ, సీఏబీఎస్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో డైరెక్టర్‌గా, అడ్మిన్ ఆఫీసర్‌గా పలు హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మాజీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రమశ్రీ,, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

అరకొర వేట!



ఒడ్డున ఉన్న బోట్లు

వాకాడు: ఇటీవల వరుస తుపాన్లు, భారీ వర్షాల కారణంగా సముద్రంలో కొత్త నీరు, అలజడి ఏర్పడి వేట సక్రమంగా సాగడం లేదని సంప్రదాయ మత్స్యకారులు వాపోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వాకాడు మండలం, కొండూరుపాళెం మత్స్యకారులు మాట్లాడుతూ ఒక్కో బోటులో ఒకరికి నలుగురు చొప్పున పొద్దు పొద్దస్తమానం సముద్రంలో గాలించినా పది, పదేహేను కిలోలకు మించి చేపలు దొరకడం లేదన్నారు. అదీ కూడా ఒకే రకం చేపలు దొరికితే అమ్ముకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. అలా కాకుండా వివిధ రకాల చేపలు, పీతలు, రొయ్యలు, గుల్లలు, చెత్తా చెదారం దొరుకుతోందన్నారు. బోట్లకు డీజిల్ ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదన్నారు.

క్లుప్తంగా

ఎల్‌ఎల్‌ఎం పరీక్షా ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన ఎల్‌ఎల్‌ఎం రెండవ సెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

నేడు ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహణపై సమీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 10నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షను నిర్వహించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణపై బుధవారం ఉదయం 10గంటలకు తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్య కళాశాలల్లో పనిచేస్తున్న సైన్స్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ) లెక్చరర్లు తప్పనిసరిగా ఈ సమీక్షకు హాజరవ్వాలని ఆర్ఐఓ కోరారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రవికుమార్ యాదవ్ (ఫైల్)

చంద్రగిరి: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని శ్రీనివాసమంగాపురం సమీపంలోని రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం అరిగివారిపల్లికి చెందిన రవి కుమార్ యాదవ్(55) శనివారం రాత్రి తిరుపతి నుంచి వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శరీరంపై నుంచి రైలు వెళ్లడంతో మృతదేహం ఛిద్రమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొన్న బొలెరో

కల్వర్టును బొలెరో ఢీకొనడంతో డ్రైవరు గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై అగరాల సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బాలాజీకి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తుమ్మలగుంటలో వైభవంగా రథసప్తమి వేడుకలు





అనంత తేజోమయునిగా సూర్య ప్రభ వాహనంపై విహరిస్తున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు, శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు



గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీమలయప్ప స్వామి

- సప్త వాహనాలపై కల్యాణ వెంకన్న విహారం
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలో రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరుపతి నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామి వారిని దర్శించి పునీతులయ్యారు. మంగళవారం ఉదయం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగారు. ప్రధాన ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక అలంకరణ, దైనందిన పూజాధికాలు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలు, కర్పూర హారతుల నడుమ స్వామి వారి వాహన సేవలు కన్నుల పండువుగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి దంపతులు వాహన సేవల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సప్త వాహనాలపై కల్యాణ వెంకన్న విహారం

ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు సూర్యప్రభ వాహనంపై స్వామి వారు భక్తులను కటాక్షించారు. ఆ తర్వాత చిన్న శేష వాహనం, గరుడ, హనుమంత వాహనాలపై విహరించారు. అనంతరం ఆలయ పుష్కరణిలో వైఖానస ఆగమోక్తంగా చక్రతాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించి చక్రస్నానం ఆచరించారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారు కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. రథసప్తమి పర్వదినాన సూర్యప్రభ వాహన సేవ తరువాత జరిగిన పుష్కరణిలో సాగిన చక్రస్నానానికి భక్తులు కిక్కిరిసిపోయారు.

సిరుల తల్లికి.. శిరసాభివందనం

- రథసప్తమి వేళ.. సప్త వాహనాలపై పద్మావతి అమ్మవారి దర్శనం



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న శ్రీ పద్మావతి అమ్మవారు



గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీ పద్మావతీ అమ్మవారు



సూర్యప్రభ వాహన సేవలో ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి రూరల్ : సిరుతల్లి శ్రీ పద్మావతీ అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. సూర్య జయంతిని పురస్కరించుకొని తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఒకేరోజు ఏడు వాహనాలపై అమ్మవారు దర్శనం ఇవ్వడంతో ఈ ఉత్సవాలు బ్రహ్మోత్సవాలను తలపించాయి. ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమైన వాహన సేవలు మధ్యాహ్నం 2 గంటల వరకు నిరాటంకంగా సాగాయి. హంస, అశ్వ, గరుడ, చిన్న శేష వాహనాలపై అమ్మవారు విహరించారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు చంద్రప్రభ, గజ వాహన సేవలు అత్యంత వైభవంగా సాగాయి.

పోటెత్తిన భక్తజనం

సిరుల తల్లికి శిరసాభి వందనం అన్నట్లుగా భక్తులు అమ్మవారి వాహనసేవల్లో పాల్గొని గోవిందా.. గోవిందా.. అంటూ ప్రార్థిస్తూ ప్రణమిల్లారు. ఒక్క రోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి పర్వదినాన అమ్మవారు సప్త వాహనాలపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రథసప్తమి పర్వదినాన కళాకారులు ప్రదర్శించిన దేవతా మూర్తుల కళా రూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు కళాకారులు చేసిన నృత్యాలు, కోలాటాలు, చెక్క భజనలు అలరించాయి. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు అమ్మవారి వాహనసేవల్లో తరించారు.

మోసకారి చంద్రబాబు

– డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: 'ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ యువగళం పాదయాత్ర నుంచి 2024 ఎన్నికల ప్రచారంలో అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి రాగానే మాట మార్చిన 'ద గ్రేట్ మోసకారి చంద్రబాబు' అని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఘాటుగా విమర్శించారు. మంగళవారం చిల్లకూరులోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పలు ప్రశ్నలు సంధించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షలు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.3 వేలు ఎక్కడని నిలదీశారు. 2025 జనవరి 1న విడుదల చేస్తామన్న జాబ్ క్యాలెండర్, వలంటీర్లను కొనసాగిస్తూ రూ.10 వేలు పారితోషకం ఇస్తామని చెప్పిన మాట ఎక్కడన్నారు. అధికారంలోకి రాగానే లక్షలాది కంపెనీలు తీసుకొచ్చి సృష్టిస్తామన్న సంపద ఎక్కడ?, బడికి వెళ్లే ఒక్కో బిడ్డకు రూ.15 వేలు ఇస్తామన్న తల్లికి వందనం ఎక్కడ?, రైతుకు రూ.20 వేలు ఇస్తామన్న పెట్టుబడి ఎక్కడ?, ఇంట్లో 19 నుండి 59 ఏళ్లు ఉన్న మహిళలకు ఒక్కరుంటే రూ.1,500, ఇద్దరుంటే రూ.3 వేలు, ముగ్గురుంటే రూ.4,500 అని చెప్పిన మాట ఎక్కడ?, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, పొదుపు మహిళలకు ఇస్తామన్న రూ.18 వేలు ఎక్కడని నిలదీశారు. కూటమి పాలనలో ఆ పార్టీ శ్రేణులంతా ఇసుక దోపిడీ, గ్రావెల్ మాఫియా, బెల్టు షాపులతో అక్రమ ధనార్జన కోసమే నిరంతరం శ్రమిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పే సమయం త్వరలో వస్తుందన్నారు.

వరి ధాన్యం కొనుగోలుకు శ్రీకారం



వరదయ్యపాళెం మండలం, కదూరు గ్రామంలో వరి ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న మండల ఏవో గౌరి

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సివిల్ సప్లయ్ అధికారులు మొదలుపెట్టారు. రెండు రోజులుగా జిల్లాలోని ఆరు మండలాల్లో కొనుగోలు చేస్తున్నారు. వారం క్రితం సాక్షి దినపత్రికలో 'ఇదేం మెలిక' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జిల్లాలోని వరదయ్యపాళెం, బీఎన్ కండ్రిగ, పిచ్చాటూరు, నాగలాపురం, డీవీ సత్రం, సూళ్లూరుపేట మండలాల్లో ఒక్కో మండలంలో రెండు నుంచి నాలుగు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సాధారణ రకం (75 కేజీలు) రూ.1,725, గ్రేడ్–ఏ రకం (75 కేజీలు) రూ.1,740 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

ఈ రూల్స్ తప్పనిసరి

- చెడిపోయినా, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యపు గింజలు 4 శాతం మించి ఉండరాదు
- వ్యర్థ పదార్థాలు, మట్టి, రాళ్లు, ఒక శాతానికి మించి ఉండరాదు
- చెత్త, తాలు(జల్లు) ఒక శాతం మించి ఉండరాదు
- రంగు మారిన ధాన్యం ఐదు శాతానికి మించ ఉండరాదు
- పరిపక్వం లేని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యం మూడు శాతం మించరాదు
- కేళీలు ఆరు శాతం మించి ఉంటే కొనుగోలు చేయరు
- తేమ 17 శాతం మించి ఉండరాదు

నిబంధనల మేరకు కొనుగోలు



ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. నాణ్యత విషయంలో రాజీ లేకుండా చర్యలు చేపడుతున్నాం. ముందుగా వ్యవసాయశాఖ అధికారులు ధాన్యం ఒబ్బిళ్ల తెలుసుకుని, ధాన్యం ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. ఆ మేరకు ఇప్పటి వరకు జిల్లాలోని ఆరు మండలాల్లో రైతు సేవా కేంద్రాల నేతృత్వంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం.

– వై.సుమతి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

సంకల్ప్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం



ఆర్.లోకనాథం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి

తిరుపతి అర్బన్: కేంద్ర ప్రభుత్వం సంకల్ప్ పథకం ద్వారా రెండు నెలలుపాటు శిక్షణ ఇచ్చి.. తర్వాత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి శ్రీకారం చుట్టిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో శిక్షణ కోసం నాలుగు సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. 8 తర్వాత మార్చి 31 వరకు శిక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ జారీచేస్తారని వివరించారు. అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు వెల్లడించారు.

తిరుపతిలో నాల్గుచోట్ల శిక్షణ

- జన శిక్షణ్ సంస్థాన్ వారి నేతృత్వంలో తిరుపతిలోని రాస్ బిల్డింగ్‌లో అసిస్టెంట్ డ్రెస్ మేకర్, అసిస్టెంట్ టెక్స్టైల్స్ ప్రింటర్, అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ, బ్యూటీ కేర్ అసిస్టెంట్, అసిస్టెంట్ జ్యూట్ కేర్ క్రాఫ్ట్ ప్రొడక్ట్ మేకర్ శిక్షణ ఇవ్వనున్నారు. కనీసం రాయడం, చదవడం పరిజ్ఞానం ఉండాలి. 18–45 ఏళ్ల వారు అర్హులు. అదనపు సమాచారం కోసం 9440275311, 9848209212, 8897309621 నంబర్లలో సంప్రదించవచ్చు.
- ఎన్టీఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్(మహిళా ప్రాంగణం) తిరుచానూరులో శిక్షణ. అసిస్టెంట్ బ్యూటీ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. కనీసం పదో తరగతి, 18–45 ఏళ్ల వారు అర్హులు. అదనపు సమాచారం కోసం 9160932881, 8333921349లో సంప్రదించవచ్చు.
- ఎస్వీయు రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ అనే శంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఏదైనా డిగ్రీ, 18–45 ఏళ్ల వారు అర్హులు. అదనపు సమాచారం కోసం 9666798537, 9110762515 నంబర్లలో సంప్రదించాలి.
- నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ వారు తిరుపతిలోని అలిపిరి రోడ్డు ఎస్వీ మెడికల్ కళాశాల వద్ద శిక్షణ ఇవ్వనున్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ అనే అంశంపై శిక్షణ అందిస్తారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలి. 18–45 ఏళ్ల లోపు వారు అర్హులు. అదనపు సమాచారం కోసం 9701440274, 9703437472 నంబర్లలో సంప్రదించవచ్చు.

రెండు బస్సులు ఢీ

– 15 మందికి గాయాలు



గూడూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చిల్లకూరు: యాత్రలకు వెళ్లి తిరిగి సొంత ఊరికి వెళుతున్న ఓ ప్రైవేటు బస్సును వెనక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు తెలంగాణా రాష్ట్రంలోని జనగాం ప్రాంతానికి చెందిన 50 మంది పుణ్య క్షేత్రాలకు 15 రోజులు క్రితం వెళ్లారు. తిరిగి వెళ్తున్న క్రమంలో చిల్లకూరు మండలం బూదనం టోల్ ప్లాజా సమీపంలోకి వచ్చింది. అదే సమయంలో నెల్లూరు –2 డిపోకు చెందిన బస్సు తిరుపతి నుంచి నెల్లూరుకు వస్తూ ముందున్న యాత్రికుల ట్రావెల్ బస్సును వెనక నుంచి ఢీ కొంది. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తోపాటుగా రెండు బస్సుల్లో ఉన్న 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనాలు, స్వర్ణ టోల్ ప్లాజా అంబులెన్స్‌లలో క్షత గాత్రులను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో జనగాం ప్రాంతానికి చెందిన శివకుమార్, వీరాస్వామి, యాకయ్య, కలమ్మలతోపాటుగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే ఆర్టీసీ బస్సులో తిరుపతి నుంచి నెల్లూరుకు ప్రయాణిస్తున్న డ్రైవర్ ఆనంద్, చిత్తూరుకు చెందిన హేమంత్‌కుమార్, పీలేరు ప్రాంతం చెరువు కింద పల్లికి చెందిన జయరామయ్య, శ్రీకాళహస్తికి చెందిన పద్మమ్మ, నెల్లూరుకు చెందిన షకీలాకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారి వద్ద నుంచి వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి

తిరుపతి తుడా: క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే ప్రాణ హాని వుండదని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని స్విమ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. స్విమ్స్ క్యాన్సర్ బ్లాక్ నిర్మాణంలో ఉందని, అందులో 5 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. స్విమ్స్‌లో బోన్ మ్యారో సేవలు కూడా త్వరలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు. క్యాన్సర్ గుర్తించడానికి పింక్ బస్ ద్వారా అన్ని పరీక్షలు చేస్తున్నట్లు తెలియజేశారు. డీన్ అల్లాడి మోహన్, అంకాలజీ వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుయాలో...

రుయా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ పారామెడికోస్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీరోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



గాంధీ రోడ్డులో ర్యాలీ

ఐఐటీ సందర్శన



బృందానికి స్వాగతం పలుకుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

రేణిగుంట: భారత ఏకాత్మత యాత్రలో భాగంగా మంగళవారం ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల బృందం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీని సందర్శించింది. విభిన్న ప్రాంతాలలో వివిధ జాతులు అవలంభించే సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా 25మంది విద్యార్థులతో కూడిన బృందం ఐఐటీకి వచ్చింది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్.సత్యనారాయణ, ఐఐటీ కాంపిటెన్సీ డెవలప్‌మెంట్ అండ్ అవుట్‌రీచ్ యాక్టివిటీస్ డీన్ ప్రొఫెసర్ అరుణ్ తంగిరాల వారిని ఆహ్వానించారు. జాతీయ సమగ్రత, సాంస్కృతిక సమ్మేళనాల ప్రాముఖ్యతను వివరించారు. ఐఐటీ క్యాంపస్‌లో ల్యాబ్‌లు, ఆధునిక భవనాలు, సాంకేతికత మేళవించిన సౌకర్యాలను చూసి విద్యార్థుల బృందం ముగ్ధులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన ఘటన మంగళవారం తొట్టంబేడు మండలంలో చోటు చేసుకుంది. తిరుపతి ఆటో నగర్‌కు చెందిన మురళి, అతని భార్య శ్యామల, కుమార్తెలు హాసిని, హర్షిణి నెల్లూరు వెళ్లి తిరిగి బయలుదేరారు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఓ వ్యాపారి కుటుంబంతో నెల్లూరుకు బయలుదేరాడు. మార్గం మధ్యలోని తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద ఈ రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపాచేపా ఎప్పుడొస్తావ్?

– చెరువుల్లో చేప పిల్లలు వదలడానికి వాయిదాలు



చేప పిల్లలు

తిరుపతి అర్బన్: జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలను వదలడానికి మత్స్యశాఖ అధికారులు వాయిదాలపై వాయిదాలు వేస్తూనే ఉన్నారు. అదిగో ఇదిగో అంటూ నాలుగు నెలలుగా కాలయాపన చేస్తున్నారు. సాధారణంగా గడిచిన పదేళ్లుగా బాపట్ల ప్రాంతం నుంచి చేప పిల్లలను సెప్టెంబర్‌లో తెచ్చుకుని రెండు నెలల పాటు జాలర్ల సమక్షంలో పెంచడం.. తర్వాత చెరువుల్లోకి నీళ్లు వచ్చి అనంతరం నవంబర్, డిసెంబర్‌లో వదిలిపెట్టేవారు. ఆ తర్వాత మూడు నెలల్లోనే (90 రోజులు) చెరువుల్లో చేప పిల్లలు పెద్దవై.. కేజీకి పైగా తూకం వచ్చేవి. వీటిని విక్రయించడం ద్వారా ఆదాయం వచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం చేప పిల్లలను తెప్పించడం మానేశారు. జాలర్ల సమక్షంలో పెంచే కార్యక్రమానికి స్వస్తి పలికారు. జనవరి మొదటి వారంలో చెరువుల్లో చేప పిల్లలను వదలనున్నట్లు మొదట ప్రకటించారు. తర్వాత జనవరి చివరి వారం, అనంతరం ఫిబ్రవరి 1 నుంచి అంటూ ప్రచారం చేశారు. తాజాగా మరో మూడు రోజుల్లో ప్రారంభిస్తామని చెబుతున్నారు. చేప పిల్లలు వదిలిపెట్టిన తర్వాత మూడు నెలలు ఉంటేనే కేజీకి పైగా తూకం వస్తాయి. అయితే మార్చి 31కి జిల్లాలోని 90 చెరువుల్లో నీళ్లు ఉండవు. ఇప్పటికిప్పుడు వదిలిపెట్టినా 50 రోజులు మాత్రమే గడువు ఉంటుంది. కనీసం అర కేజీ అయినా తూకం వస్తాయని అంతా భావిస్తున్నారు. అయినా వదిలిపెట్టకుండా వాయిదాలు వేయడంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

మూడు రోజుల్లో వదులుతాం



మరో మూడు రోజుల్లో చేప పిల్లలను చెరువుల్లో వదులుతాం. ముందుగా మత్స్యకారుల సొసైటీలున్న చెరువుల్లో, ఆ తర్వాత చెరువుల్లో నీటి శాతాన్ని బట్టి చేప పిల్లలు వదులుతాం.

– నాగరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఎరచ్రందనం అక్రమ రవాణాకు ఏడాది జైలు

తిరుపతి లీగల్ : ఎరచ్రందనం దుంగలను అక్రమ రవాణా చేసిన కేసులో డక్కిలి మండలం, వెల్లికల్లుకు చెందిన ఆటో డ్రైవర్ ఎం.గురునాథంకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎరచ్రందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి ఎస్.శ్రీకాంత్ మంగళవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. 2012 సెప్టెంబర్ 25వ తేదీ వెంకటగిరి ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది బాలయ్యపల్లి మండలం, అక్కంపేట– కయురు చెరువు అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా నిందితుడు గురునాథం తన వాహనంలో 373 కిలోల 18 ఎరచ్రందనం దుంగలను తరలిస్తూ ఫారెస్ట్ సిబ్బందికి పట్టుబడ్డాడు. వెంకటగిరి రేంజ్, బాలయ్యపల్లి సెక్షన్ ఫారెస్ట్ సిబ్బంది అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శిరీష వాదించారు.